క్లుప్తంగా

రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులు అవలంభించాలి

వీరఘట్టం: రైతులు పంటలో వేసే యూరియాకు బదులు నానో యూరియా వినియోగించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి జె.సౌజన్య సూచించారు. గురువారం విక్రమపురం గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల నుంచి రైతులు బయట పడేందుకు నానో యూరియా, డీఏపీలను వినియోగించి దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి ఎస్‌ఐగా ఫక్రుద్దీన్

గరుగుబిల్లి: పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా ఎస్.కె.ఫక్రుద్దీన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్పీ మాధవరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫక్రుద్దీన్ ప్రస్తుతం ఎస్పీ కార్యాలయంలో డీసీఆర్‌బీ ఎస్‌ఐగా పనిచేస్తున్నారు. ఈయన గతంలో పార్వతీపురం రూరల్, టౌన్‌ల ఎస్‌ఐగా విధులు నిర్వహించారు.

అన్నదానం


అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

గరుగుబిల్లి: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పెద్దూరు బీసీ కాలనీలో అన్నదాన కార్యక్రమం గురువారం నిర్వహించారు. శ్రీరామభక్త భజన మండలి ఆధ్వర్యంలో గ్రామస్తుల ప్రోత్సాహంతో జరిగిన ఈ కార్యక్రమంలో 2,500 మంది భక్తులు పాల్గొని, స్వామి అన్నప్రసాదం స్వీకరించారు.

వివక్ష తగదు


సమానత్వంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: బాల బాలికలు అన్న వివక్ష లేకుండా సమాన భావంతో ఉండాలని సీడీపీవో రంగలక్ష్మి అన్నారు. జిల్లా బాలల సంరక్షణ, లీగల్ విభాగం అధికారి పి.శ్రీధర్ నేతృత్వంలో గురువారం లింగ వివక్షపై అవగాహన కార్యక్రమం స్థానిక ప్రాజెక్టు పరిధిలో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో నిర్వహిస్తున్న సంకల్ప కార్యక్రమం ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. మహిళా సాధికారిత, బాలల రక్షణ, సామాజిక స్వావలంబనపై చైతన్యపర్చారు. బాల్య వివాహాల కారణంగా ఏర్పడే అనర్థాలు, గృహ హింస, బాలల హక్కుల చట్టంపై వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దశారత్నం, హరికృష్ణ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

వైభవంగా నిమజ్జనోత్సవాలు


వీరఘట్టం: ముచ్చర్లవీధి వినాయకుని వద్ద కుంకుమపూజలు చేస్తున్న దంపతులు

పాలకొండ రూరల్: గణపతి మండపాల్లో గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. పాత బస్టాండ్ వద్ద కొలువైన గణపతి మండపం వద్ద మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మండలంలోని లుంబూరు, తుమరాడ తదితర గ్రామాల్లో చేపట్టిన అన్న సమారాధనలో భక్తులు పెద్దెత్తున పాల్గొన్నారు. కొత్తవీధిలో కొలువు తీరిన మార గణపతి తిరువీధి వైభవంగా జరిగింది.

విఘ్నరాజుకు విశేష పూజలు

వీరఘట్టం: స్థానిక ముచ్చర్లవీధిలో వినాయక చవితి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం విఘ్నరాజుకు విశేష పూజలు చేశారు. ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

యూరియా పంపిణీ చేయాలి

కొమరాడ: యూరియా పంపిణీ చేయాలని మండల రైతులు కోరుతున్నారు. మండలంలోని గుణానపురం ఆర్‌ఎస్‌కే(రైతుసేవా కేంద్రం) వద్ద 10 టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయి. ఇక్కడ శుక్రవారం యూరియా సరఫరా చేస్తారన్న విషయం తెలుసుకున్న రైతులంతా ఒక్కసారిగా అక్కడికి చేరుకోవడంతో రైతుల రద్దీని చూసి వ్యవసాయాధికారి ప్రసాదరావు, ఎస్‌ఐ నీలకంఠంలు శనివారం యూరియా పంపిణీ చేస్తారని చెప్పడంతో అన్నదాతలంతా నిరాశతో వెనుదిరిగారు. తక్షణమే యూరియా పంపిణీ చేయాలని, రైతులకు సరిపడ యూరియాను ప్రభుత్వమే సరఫరా చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. యూరియా ఇవ్వకుండా ఇలా పంపిస్తుండడం సరికాదన్నారు.

హడలెత్తిస్తున్న గ్రామసింహాలు



- 8 నెలల్లో జిల్లావ్యాప్తంగా కుక్క కాటుకు గురైన వారు 2185 మంది
- కుక్కకాటుతో జిల్లా కేంద్రంలో మృతి చెందిన నాలుగేళ్ల బాలుడు
- శునకాల బెడదను పట్టించుకోని అధికారులు




వీధుల్లో స్వైర విహారం చేస్తున్న కుక్కలు

పార్వతీపురం రూరల్:

గుంపులు గుంపులుగా వీధి కుక్కలు తిరుగుతూ వీధుల్లోని ప్రజలను హడలెత్తిస్తున్నాయి. ప్రజలపై శునకాల దాడులకు ఫుల్‌స్టాప్ పడడం లేదు. చిన్నారులు ఆటలు ఆడుతున్నప్పుడు, ద్విచక్ర వాహనాలపై వాహన చోదకులు వెళ్తున్నప్పుడు ఏ మూల నుంచి ఏ కుక్క వచ్చి దాడిచేస్తుందో తెలియని భయానక పరిస్థితులు నెలకొన్నాయి. చిన్నారులను ఒంటరిగా వదలాలంటేనే తల్లిదండ్రులు భయపడే పరిస్థితి ఏర్పడింది. వీధిలోనే ఇంటి ముందే ఆడుకుంటున్నా ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు భీతిల్లుతున్నారు.

నాలుగేళ్ల బాలుడి మృతి


కుక్క కాటు కారణంగా మృతి చెందిన బాలుడు లోహిత్ (ఫైల్)

గత నెల 16న పార్వతీపురం జిల్లా కేంద్రంలో ఉన్న మణికంఠ కాలనీలో గవర రోహిత్ అనే 4సంవత్సరాల బాలుడు తన ఇంటి సమీపంలో వీధిలో ఆడుకుంటున్న క్రమంలో ఓ వీధి కుక్క దాడి చేసి ఛాతీపై బలమైన గాయలు చేసింది. దీంతో తల్లిదండ్రులు హుటాహుటిన జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి వైద్యుల సూచనల మేరకు మూడు రోజుల పాటు చికిత్స అందించారు. అయితే కొన్ని రోజుల పాటు చలాకీగా ఉంటూ ఇటీవల వీధిలో ఏర్పాటు చేసిన చవితి మంటపం వద్ద డాన్సులు వేస్తూ అలరించిన చిన్నారి లోహిత్ ఒక్కసారిగా మంగళవారం తీవ్ర ఆరోగ్యానికి గురవడంతో, తల్లిదండ్రులు జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా మృతి చెందాడు. కుక్క కాటు కారణంగానే తమ కుమారుడు మృతి చెందినట్లు తల్లిదండ్రులు, బంధువులు చెబుతున్నారు. అలాగే గతంలో జియ్యమ్మవలస మండలం బిత్రపాడు వద్ద కుక్కల దాడిలో శంకరరావు అనే రైతు దారుణంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు. ఇదే మండలంలో పక్క గ్రామమైన వెంకటరాజపురంలో వీధి కుక్కలు దాడి చేయడంతో లక్ష్మి అనే వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయింది. అలాగే సాలూరు పట్టణంలోని మూడో వార్డు గుమడాంలో కుక్కల స్వైర విహారం చేస్తూ గుంపులుగుంపులుగా వచ్చి పశువుల శాలలో ఉన్న నెలరోజుల వయస్సు గల 27 మేకపిల్లలపై దాడి చేసి వాటి మృతికి కారణమయ్యాయి.

2185 మందికి కుక్క కాటు



వీధి కుక్కల దాడిలో గాయపడిన వారి సంఖ్య ఏటా వేలల్లో ఉంటోంది. ఆరోగ్య శాఖ లెక్కల ప్రకారం 2025జనవరి నుంచి 2025 సెప్టెంబర్ వరకు 2185 మంది కుక్క కాటు బారిన పడ్డారు. ఇది కేవలం ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారి సంఖ్య మాత్రమే. ప్రైవేట్ ఆస్పత్రులు, ఇతర నాటు వైద్యుల వద్దకు వెళ్లి చికిత్స పొందిన వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

స్వైర విహారం చేస్తున్నాయి

వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తూ ప్రజలను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. పార్వతీపురం, సాలూరు, పాలకొండ మున్సిపాలిటీల్లోను, అలాగే పలు గ్రామాల్లో రోడ్లపై తిరుగుతూ చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు, సైకిల్, ద్విచక్ర వాహనదారులను వెంబడించి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వీధి కుక్కల స్వైర విహారంతో స్థానిక ప్రజలు బెంబేత్తుతున్నారు. రాత్రి సమయాలలో సైతం రోడ్లపైకి వచ్చి నడుచుకుంటూ వేళ్లే వారిపై వీధి కుక్కలు దాడులకు పాల్పడుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రజలు కుక్కల దాడులకు బలవుతున్నా సంబంధిత అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదైనా సంఘటన జరిగినప్పుడే స్పందించే అధికారులు తరువాత ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్యం

పెంపుడు కుక్క కరిచినప్పుడు, బాధితుడు కుక్క యజమానిని సంప్రదించి, దానికి రేబిస్ టీకాలు వేయించారో లేదో కనుక్కోవాలి. ఈ పని తప్పనిసరిగా చేయాలి. ఇలా చేస్తే సమస్య సగం పరిష్కారమైనట్లే. వీధి కుక్కలు లేదా గుర్తు తెలియని కుక్క కాటుకు గురైన వారు వెంటనే గాయమైన ప్రాంతాన్ని శుభ్రంగా 10 నిమిషాల పాటు కడగడంతో పాటు 24 గంటల్లోపే వ్యాక్సిన్ తీసుకోవాల్సి ఉంటుంది. నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ముప్పు. గాయాల తీవ్రత ఎక్కువగా ఉంటే వైద్యులు యాంటీబాడీ థెరపీ చేస్తారు. ఫలితంగా రేబిస్ వ్యాధి నుంచి తప్పించుకోవచ్చు.

– టి. జగన్మోహనరావు, జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి, పార్వతీపురం మన్యంజిల్లా

మొక్కలు అంటుకట్టడంపై శిక్షణ


శిక్షణలో సూచనలిస్తున్న హార్టీకల్చర్ సైంటిస్ట్

సీతంపేట: మొక్కలు అంటుకట్టడంపై పలువురు గిరిజన యువతీ, యువకులకు స్థానిక హెచ్‌ఎన్‌టీసీ ఫారంలో కృషి విజ్ఞాన కేంద్రం రస్తాకుంటుబాయి ఆధ్వర్యంలో టెన్త్ నుంచి డిగ్రీ వరకు చదివిన 50 మందికి శిక్షణ ఇచ్చారు. జీడి, మామిడి, పనస, సపోట, పండ్ల మొక్కలలో అంటుకట్టే విధానం, పోర్ట్రేల్లు నారు మొక్కల పెంపకంపై హార్టీకల్చర్ సైంటిస్ట్ శ్రీనివాసరాజు శిక్షణ ఇచ్చారు. అనంతరం ఇప్పగూడలో మారిషస్ ఫైనాపిల్, పసుపు సాగు వంటి వాటిపై రైతులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌వో ఎస్‌వీ గణేష్, ఉద్యానవన అధికారి పి.జయశ్రీ, సబ్ అసిస్టెంట్ కె.కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలపై అప్రమత్తంగా ఉండాలి


వైద్యాధికారికి సూచనలిస్తున్న పీవో

సీతంపేట: వైద్యసేవల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. మండలంలోని మర్రిపాడు పీహెచ్‌సీని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రోజువారి వోపీ ఎంత వస్తుంది, మందులు అందుబాటులో ఉన్నాయా?, కొండశిఖర గ్రామాల నుంచి పీహెచ్‌సీకి రోగులు రావడానికి ఎంత సమయం పడుతుందనే అంశాలను వైద్యాధికారి సత్యవేణిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం గూడంగి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో నిర్మిస్తున్న మల్టీపర్పస్ భవనాన్ని చూశారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, డీఈ నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వెళ్లాలంటే.. నాలుగు కిలోమీటర్లు నడవాల్సిందే..



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఆదిమ గిరిజన విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే 4 కిలోమీటర్ల కొండ ఎక్కి, దిగుతూ తుప్పలు, డొంకలు మధ్య నడుచుకుంటూ వెళ్లాల్సిందే. సీతంపేట ఏజెన్సీలోని ఉసిరికపాడు గ్రామంలో ఐదుగురు విద్యార్థులు ఉన్నారు. గ్రామంలో ఎటువంటి పాఠశాల లేకపోవడంతో మర్రిపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతులు వరకు చదువుతున్నారు. గ్రామంలోగాని సమీపంలో ఉన్న రేగులగూడ, మూలగూడలలో పాఠశాల లేకపోవడంతో సుదూర ప్రాంతంలో ఉన్న మర్రిపాడు పాఠశాలకు ప్రతీ రోజు ఉదయం 4, సాయంత్రం 4 కిలోమీటర్ల మేర నడుస్తూ వెళ్లి వస్తుంటారు. గ్రామానికి పూర్తి స్థాయిలో రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆటోలు వంటివి కూడా వెళ్లని పరిస్థితి. దీంతో అవస్థలు తప్పడం లేదు. – సీతంపేట

సారా రహిత మండలంగా తీర్చిదిద్దుదాం..


మాట్లాడుతున్న ఎంపీపీ, సీఐ తదితరులు

సీతంపేట: సీతంపేటను సారా రహిత మండలంగా తీర్చిదిద్దడానికి గురువారం మండల కమిటీ తీర్మానం చేసినట్టు ఎక్సైజ్ శాఖ సీఐ సూర్యకుమారి తెలిపారు. ఈ మేరకు మండల కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఎంపీపీ బి.ఆదినారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించామన్నారు. తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్‌ఐ తదితర సభ్యులు హాజరై సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి


వినతిపత్రం అందజేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు, సీఐటీయూ నాయకులు

కురుపాం: గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల పరిధిలోని పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు చెల్లించాల్సిన బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.మన్మధరావు కోరారు. ఇదే విషయమై ఆయన గ్రీన్ అంబాసిడర్లతో కలిసి కురుపాం మండల పరిషత్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. పంచాయతీల పరిశుభ్రతలో గ్రీన్ అంబాసిడర్ల పాత్ర చాలా కీలకమని, వారు చిన్నపాటి జీతానికి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారని, అలాంటి వారి జీతాలు ఎనిమిది నెలలుగా చెల్లించకపోతే వారి కుటుంబ పోషణ ఎలా అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం చొరవ తీసుకుని, గ్రీన్ అంబాసిడర్లకు వెంటనే జీతాలు చెల్లించేలా చూడాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల గ్రీన్‌అంబాసిడర్ల యూనియన్ నాయకులు బిడ్డిక మాస, తోయక పెంటయ్య, బిడ్డిక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: తమకు బకాయిపడిన వేతనాలు తక్షణమే చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్లు కోరుతున్నారు. ఇదే విషయమై స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. తమ వేతనాల చెల్లింపులు త్వరితగతిన జరిగేలా చూడాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావుకు వారు వినతి పత్రం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాలకొండ: పాలకొండ నుంచి వీరఘట్టంకు వెళ్లే ప్రధాన విద్యుత్ లైను మెయింటెనెన్స్ పనులు శుక్రవారం చేయనున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ కె.విష్ణుమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో నవగాం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఫీడర్లకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

కొమరాడ: మండలంలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ అధికారి గొర్లి వెంకటరమణ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ తీగలను తాకే చెట్లకొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో కొమరాడ, గంగారేగులవలస, కొట్టు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

జియ్యమ్మవలస రూరల్: కురుపాం, జియ్యమ్మవలస మండలాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ అధికారులు గురువారం తెలిపారు. విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల

గరుగుబిల్లి: మండలంలోని 25 పంచాయతీలకు రెండో విడత 15వ ఆర్థికసంఘం నిధులు విడుదలయ్యాయి. విడుదలైన రూ.81.09 లక్షల నిధులను గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు అందివ్వడంతో పాటు ప్రాధాన్యతా క్రమంలో నిర్వహించనున్న పారిశుధ్య పనులకు వినియోగించనున్నామని డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు గురువారం తెలిపారు.

భజన పోటీల విజేత వాల్తేరు

పాలకొండ: పట్టణంలోని ఏలాం సెంటర్‌లో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి భజన పోటీల్లో సంతకవిటి మండలం వాల్తేరు గ్రామానికి చెందిన విజయగణపతి బృందం విజేతగా నిలిచింది. గురువారం జరిగిన ఈ పోటీల్లో వాల్తేరుకు చెందిన భజన బృందం సభ్యులు మొదటి బహుమతి పొందారు. రేగిడి మండలం కాగితాపల్లికి చెందిన ఉమా రామలింగేశ్వర భజన బృందం రెండో స్థానం, వీరఘట్టం మండలం తెట్టంగి గ్రామానికి చెందిన దాటి పాపమ్మ భజన బృందం మూడవ స్థానం పొందాయి.

సైబర్ నేరాలపై చైతన్యం అవసరం :ఎస్పీ


సిబ్బంది, మహిళా పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పాలకొండ రూరల్: ఇటీవల చోటుచేసుకుంటున్న సైబర్ నేరాలపై ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాలని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి అన్నారు. గురువారం డివిజన్ కేంద్రం పాలకొండ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ క్రమంలో సర్కిల్ పరిధిలో నమోదైన కేసుల పూర్వాపరాలను డీఎస్పీ ఎం.రాంబాబు, సీఐ ఎం.చంద్రమౌళి వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లాక్‌డ్ మోనటరింట్ హోం(ఎల్‌హెచ్‌ఎం)పై ప్రజల్లో చైతన్యం తేవటం వలన దొంగతనాలను అరికట్టవచ్చన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రచారం చేయాలన్నారు. నేర పరిశోధనలో సీసీలు కీలకమని గుర్తించాలని సూచించారు. మాదక ద్రవ్యాల రవాణా, మత్తు పదార్థాల, గంజాయి వినియోగదారులపై ఉక్కుపాదం మోపాలన్నారు. సచివాయాల పరిధిలో పనిచేస్తున్న మహిళా పోలీసులకు దిశా నిర్దేశం చేశారు. ఆయన వెంట ఎస్‌ఐ కె.ప్రయోగమూర్తి, కళాధర్, అప్పరావు, సిబ్బంది ఉన్నారు.

మంచాన పడిన యువకుడికి ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న వాట్సాప్ గ్రూప్ సభ్యులు

కురుపాం: కొన్నిరోజుల క్రితం జరిగిన ట్రాక్టరు ప్రమాదంలో తీవ్రగాయాలతో మంచానపడిన మండల కేంద్రంలోని మంతినివలసకు చెందిన కోన మురళి అనే గిరిజన యువకుడికి స్థానిక వాట్సాప్ గ్రూప్ సభ్యులు ఆర్థికసాయం చేశారు. నడుముకు తీవ్రగాయమై మంచానపడిన కొడుకు మురళిని చూసిన తల్లి వరాలమ్మ మనోవేదనతో ఇటీవల మృతి చెందింది. ఈ నేపథ్యంలో వైద్యం చేయించుకునేందుకు ఇబ్బంది పడుతున్న మురళిని చూసి, అతడి పరిస్థితిని స్థానిక వాట్సాప్ గ్రూప్‌లో వివరిస్తూ పోస్ట్ పెట్టారు. దీంతో ఆ గ్రూప్ సభ్యులంతా చందాల రూపంలో పోగు చేసిన రూ.28,200 నగదును బాధితుడికి గురువారం అందజేశారు. ఈ మేరకు బాధితుడు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఏ సాయం కావాలన్నా తమను అడగాలని అండగా ఉంటామని వారు భరోసానిచ్చారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు కర్రి శ్రీరామ్మూర్తి నాయుడు, యస్.సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, పాట్నూరు రవికుమార్, ఎస్.రవి పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలో తాగునీటికి అంతరాయం కలుగుతుందని కమిషనర్ రత్నం రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణానికి నీటి సరఫరా చేసే పంప్‌హౌస్ మరమ్మతులకు గురి కావడంతో ఈ సమస్య కలిగిందని తెలిపారు. ప్రస్తుతం నాగావళి నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో మరమ్మతులు చేపట్టడం సాధ్యం కావడం లేదని తెలిపారు. ఈ కారణంగా పట్టణంలోని 9, 10, 11, 12, 13, 14, 15, 16, 17, 18 వార్డులకు కుళాయిల ద్వారా తాగునీరు అందడం లేదని తెలిపారు. ప్రజలకు ఈ విషయాన్ని గుర్తించి తాగునీటి కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం


వీరఘట్టం: మెమొంటోలతో సన్మాన గ్రహీతలు


కురుపాం: సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కురుపాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. దేశ తొలి ఉపరాష్ట్రపతి, రెండో రాష్ట్రపతి, ఉపాధ్యాయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు పురస్కరించుకుని, ఏటా ఈ కార్యక్రమం జరుపుకుంటారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పాఠశాల సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని నమ్మిన వ్యక్తులలో రాధాకృష్ణన్ ప్రథములని, ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరం కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయలు జగదీశ్వరరావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: భారత ప్రప్రథమ ఉపరాష్ట్రపతి, రెండో రాష్ట్రపతి, ఉత్తమ ఉపాధ్యాయునిగా కీర్తిగాంచిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని, స్థానిక బాలికోన్నత పాఠశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులంతా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగమణి, ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత తీర్చండి

భామిని: మండలంలో ఎరువుల కొరత తీవ్రంగా ఉందని యూరియా దొరక్క రైతులు అవస్థలు పడుతున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, మండల సంఘ అధ్యక్షుడు కొత్తకోట బాబూరావు ఆందోళన వ్యక్తం చేశారు. భామిని తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేశారు. వీరి ఆందోళనకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బోదెపు శ్రీనివాసరావు, బాలేరు ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్, మాజీ సర్పంచ్ పోతల మజ్జిలు మద్దతు ఇచ్చారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శంకరనాయుడుకు వినతిపత్రం అందజేశారు.